RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

www.nityamnigha.com

NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025




వరంగల్ | సంపుటి 2 | సంచిక 81 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | మంగళవారం | 22.09.2026 | పేజీలు : 8

## 30 రోజుల్లో వరంగల్ ఆసుపత్రి

# నిర్మాణం పూర్తి కావాలి

### - సీఎం రేవంత్ రెడ్డి డెడ్‌లైన్

- గ్రీన్ ఛానల్‌లో నిధులు ఇస్తున్నా పనుల్లో జాప్యంపై అధికారులపై ముఖ్యమంత్రి అసహనం.
- వచ్చే 30 రోజుల పాటు 24 గంటలూ పనులు కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు.
- కలెక్టర్ల ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ వేసి రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలని సూచన.
- సనత్‌నగర్ టిమ్స్ తరహాలోనే వరంగల్ ఆసుపత్రిలోనూ త్వరలోనే ఓపీ సేవలు ప్రారంభం.



**నిత్యం నిఘా, హైదరాబాద్ :** వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి గ్రీన్ ఛానల్‌లో నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ పనుల్లో జాప్యం జరగడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడిన ఆయన, వచ్చే 30 రోజుల పాటు రోజుకు 24 గంటలూ నిరంతరాయంగా పనులు కొనసాగించాలని ఆదేశించారు. పనుల ప్రగతికి నిర్దిష్ట షెడ్యూల్..

మిగతా 2 వ పేజీ లో..



## రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా..?

- ఎండిపోతున్న పంటలకు నీళ్లివ్వాలని కోరిన రైతులను అరెస్ట్ చేశారన్న కేటీఆర్
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం
- బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించారని ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వమంటూ తీవ్ర విమర్శ
- అరెస్ట్ చేసిన వారిని విడుదల చేసి, నీళ్లు ఇవ్వాలని డిమాండ్

**నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ :** ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాల్సింది పోయి, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఒక ప్రకటన విడుదల .....

మిగతా 2వ పేజీ లో..

## ట్యాంక్‌బండ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత.. పోలీసులతో ఉత్సవ సమితి ఘర్షణ.. బారికేడ్లు తొలగింపు!

- గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలతో ట్యాంక్‌బండ్‌పై హైటెన్షన్
- నిరసనకు దిగిన భాగ్యనగర్ ఉత్సవ సమితి, పోలీసుల మధ్య తోపులాట
- హైకోర్టు ఆదేశాల మేరకే ఆంక్షలని అధికారుల స్పష్టీకరణ
- సంప్రదాయాన్ని వీడేది లేదని, ట్యాంక్‌బండ్‌పైనే నిమజ్జనం చేస్తామని పట్టు

2



## తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్న మాజీ మావోయిస్టులు

- లంకా పాపిరెడ్డి, అడ్వొకేట్ బల్ల రవీంద్రనాథ్ నేతృత్వంలో పార్టీ
- పార్టీ నిర్మాణంలో దేవ్‌జీ, సంగ్రామ్ ల భాగస్వామ్యం లేనట్టు సమాచారం
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న పార్టీ

2



## సిలబస్ మార్పుపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన.. అభ్యర్థులకు ఊరట

- పోటీ పరీక్షల సిలబస్‌పై వస్తున్న వదంతులకు టీజీపీఎస్సీ తెర
- ప్రస్తుతానికి ఎలాంటి సిలబస్ కమిటీని ఏర్పాటు చేయలేదని వెల్లడి
- పెద్ద మార్పులు ఉంటే ఏడాది ముందుగానే సమాచారం ఇస్తామని హామీ
- చిన్నపాటి మార్పులను నోటిఫికేషన్‌లోనే తెలియజేస్తామని ప్రకటన

2

## బేగంపేటలో భారీ చోరీ.. 81 తులాల బంగారం, నగదు అపహరణ



81 తులాల బంగారం, రూ.14.75 లక్షల నగదు అపహరణ

ఇంట్లో పనిచేసే సిబ్బందిపైనే అనుమానం

ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు

**నిత్యం నిఘా, హైదరాబాద్ :** హైదరాబాద్ బేగంపేట ఉమానగర్ లో భారీ చోరీ జరిగింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన శ్రీనాథ్ నాయుడు ఇంట్లో అల్మారాలో దాచిన 81 తులాల బంగారం, రూ.14.75 లక్షల నగదు మాయమయ్యాయి. నగలు, నగదు కనిపించకపోవడం ఆలస్యం గా గుర్తించిన బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో పనిచేసే సిబ్బంది వివరాలను పోలీసులకు అందజేశారు. బాధితుడి ఫిర్యాదు తో కేసు నమోదు చేసిన పోలీసులు, ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. చోరీకి పాల్పడింది వారేనా లేక ఇతరుల ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

- ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే
- సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి
- మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన
- శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన
- ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు

**నిత్యం నిఘా, ఎర్రవల్లి :** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, పరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది. సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ



ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు. సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు.

## దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు



- ఎపార్టీ ఫిరాయింపుల కేసులో దానంను అనర్హుడిగా ప్రకటించిన హైకోర్టు
- హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన దానం
- దానం పిటిషన్ ను బుధవారం విచారించనున్న సుప్రీంకోర్టు

2

## రామ మందిరంలో భారీ కుంభకోణం : 105 సార్లు విరాళాల చోరీ

- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిర్ధారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం
- ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది అరెస్ట్
- సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలుకు ఏర్పాట్లు
- ట్రస్టు ఉన్నత పదవుల నుంచి చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తొలగింపు



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

## 30 రోజుల్లో వరంగల్ ఆసుపత్రి
# నిర్మాణం పూర్తి కావాలి
**- సీఎం రేవంత్ రెడ్డి డెడ్‌లైన్**

**మొదటిపేజీ తరువాయి..** రూపొందించి, ప్రతి పనికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని, కలెక్టర్లు రోజువారీగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల సమన్వయం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు ఆసుపత్రి పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. సనత్‌నగర్ టిమ్స్ తరహాలోనే వరంగల్ ఆసుపత్రిలోనూ వెంటనే ఓపీ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, ఆసుపత్రి నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించాలని ఆదేశించారు. అలాగే సనత్‌నగర్ టిమ్స్‌లో స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, వైద్య ఆరోగ్య, రోడ్లు భవనాలు, పుర పాలక శాఖల ఉన్నతాధికారులు, వరంగల్ మరియు హనుమకొండ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## రైతులకు నీళ్లివ్వమంటే
# అరెస్టులా..?

**మొదటిపేజీ తరువాయి..** చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వందలాది మంది రైతులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులు ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీగా పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను, రైతులను వెంటనే విడుదల చేసి, జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

**మొదటిపేజీ తరువాయి..** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని..ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ అంశాన్ని ప్రస్తావించగా, ఈ పిటిషన్‌ను బుధవారం (సెప్టెంబర్ 23) విచారించనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. హైకోర్టు తీర్పు వల్ల ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారి ఉపఎన్నిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున, హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించనున్నారు. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్... ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఒక పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరపున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన పాత ఆదేశాలను పక్కనపెట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించడంతో ఈ వివాదం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కింది.

## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హౌస్ అరెస్ట్



**నిత్యం నిఘా, హైదరాబాద్ :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ప్రాజెక్టు ముట్టడి పిలుపు జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు భారీ ఎత్తున రంగంలోకి దిగి ముందస్తు అరెస్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని వనపర్తిలోని ఆయన నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకుని గృహనిర్బంధం చేశారు. ముట్టడి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఇంటెలిజెన్స్ బలగాలను మోహరించి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పోలీసుల దిగ్బంధంతో జూరాల ఆనకట్ట పరిసరాలు, క్షేత్రస్థాయి ప్రాంతాలు పూర్తిగా వ్యూహాత్మక బలగాల మోహరింపుతో నిండిపోయాయి. వనపర్తి, ఆత్మకూరు, అమరచింత, నర్వ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రాజెక్టు వైపు రాకుండా రహదారుల వెంట వాహన తనిఖీలు చేపట్టారు. మరోవైపు గద్వాలలోనూ కాలువలకు నీటిని విడుదల చేయాలనే డిమాండ్‌తో అఖిలపక్షం, రైతు సంఘాలు కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వడంతో అక్కడ కూడా నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ ముట్టడి పిలుపు, పోలీసుల కట్టుదిట్టమైన ఆంక్షల నడుమ జూరాల ప్రాజెక్ట్ సమీపంలో హైటెన్షన్ వాతావరణం కొనసాగుతోంది.

## రామ మందిరంలో భారీ కుంభకోణం : 105 సార్లు విరాళాల చోరీ

**మొదటిపేజీ తరువాయి..** అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీకి సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో ఏకంగా 105 సార్లు విరాళాల అపహరణ జరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టుకు సిట్ తన నివేదికను సమర్పించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసుకు సంబంధించిన సిట్ నివేదికలోని కీలక అంశాలను ధర్మాసనం ముందుంచారు. సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. సాధారణంగా విరాళాలకు సాఫ్ట్‌వేర్ ద్వారా రశీదులు జారీ చేసి, ఆ నగదును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) లాకర్‌లో భద్రపరుస్తారు. అయితే, ఈ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం దర్యాప్తు తుది దశకు చేరుకుందని, సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని మెహతా కోర్టుకు వివరించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామ్ శంకర్ యాదవ్ ఉన్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి రావడంతో రామ్ మందిర్ ట్రస్టులో కీలక మార్పులు చేశారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలు తప్పుకున్న అనంతరం, ఆలయ పరిపాలన కోసం సీఈఓ నేతృత్వంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నూతన సీఈఓగా నియమించారు. కాగా, సిట్ నివేదిక ప్రతిని తమకు అందజేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

## రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్...
### శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

**నిత్యం నిఘా, హైదరాబాద్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని రాయదుర్గంలో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. మల్కం చెరువు వెనుక భాగంలో 2.85 ఎకరాల విస్తీర్ణంలో ఈ టవర్స్‌ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఆయన ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడు తూ, అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందేవరకు ఈ పథకం దశలవారీగా నిరంతరాయంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లను నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల సంక్షేమాన్ని విస్మరించి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. నగరానికి దూరంగా, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో గత ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తే, తమ ప్రభుత్వం అత్యంత విలువైన ప్రాంతాల్లోనే పేదలకు గృహ వసతి కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, కేవలం పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇళ్లను కేటాయిస్తున్నామని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. విచారణలో అనర్హులుగా తేలిన ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన వారికి ప్రత్యేక అనుమతులు మంజూరు చేస్తామని, బేస్‌మెంట్ పూర్తి చేసిన ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు. అయితే, ఇళ్లు మంజూరై ఉండి, ఇప్పటి



వరకు నిర్మాణం ప్రారంభించని అనర్హుల కేటాయింపులను రద్దు చేస్తామని, ఆ స్థానంలో అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## సిలబస్ మార్పుపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన.. అభ్యర్థులకు ఊరట

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక స్పష్టతనిచ్చింది. పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పులు చేస్తారంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వదంతులకు కమిషన్ తెరదించింది. సిలబస్ మార్పుపై అభ్యర్థుల నెలకొన్న ఆందోళనలు, వారి నుంచి వెల్లువెత్తుతున్న వినతుల నేపథ్యంలో టీజీపీఎస్సీ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. సిలబస్ సమీక్ష కోసం ప్రస్తుతానికి ఎలాంటి కమిటీని ఏర్పాటు చేయలేదని టీజీపీఎస్సీ కార్యదర్శి స్పష్టం చేశారు. భవిష్యత్తులో పోటీ పరీక్షల సిలబస్‌లో ఏవైనా భారీ మార్పులు చేపట్టాల్సి వస్తే, ఆ విషయాన్ని కనీసం ఏడాది ముందే అభ్యర్థులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. తద్వారా అభ్యర్థులు మారిన సిలబస్‌కు అనుగుణంగా సిద్ధమవడానికి తగిన సమయం లభిస్తుందని పేర్కొన్నా రు. అదే విధంగా, ఏవైనా స్వల్ప మార్పులు లేదా చేర్పులు అవసరమైతే, ఆ వివరాలను సంబంధిత ఉద్యోగ నియామక నోటిఫికేషన్‌తో పాటే వెల్లడిస్తామని వివరించారు. సిలబస్ మార్పుపై అభ్యర్థులు అనవసరంగా ఆందోళన చెందవద్దని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఈ సందర్భంగా సూచించారు. కమిషన్ ఇచ్చిన ఈ స్పష్టతతో లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఊరట లభించినట్లయింది.

## ట్యాంక్‌బండ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత..
### పోలీసులతో ఉత్సవ సమితి ఘర్షణ.. బారికేడ్లు తొలగింపు!

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనం అంశం మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. హుస్సేన్‌సాగర్‌లో ట్యాంక్ బండ్ వైపు విగ్రహాల నిమజ్జనానికి అనుమతి లేదంటూ అధికారులు ఏర్పాటు చేసిన ఆంక్షలను వ్యతిరేకిస్తూ భాగ్య నగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆందోళనకు దిగింది. ఈ క్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. దీంతో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉత్సవ సమితి ప్రతినిధులు అక్కడ బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన కొన్ని బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ తోపులాటలో కొందరు పోలీసులు కిందపడిపోయినట్లు సమాచారం. అప్రమత్తమైన ఉన్నతాధికారులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే పర్యావరణ పరిరక్షణ కోసం హుస్సేన్‌సాగర్‌లో, ముఖ్యంగా ట్యాంక్‌బండ్‌పై ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల నిమజ్జనాన్ని నియంత్రిస్తున్నట్లు జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ట్యాంక్‌బండ్‌పై నుంచి విగ్రహాలను నేరుగా సాగర్‌లో వేయకుండా 10 అడుగుల రైలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నిమజ్జనం నిషిద్ధమంటూ ఫ్లెక్సీలను కూడా పెట్టారు. అయితే, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ ప్రాంతాల్లో మట్టి, పర్యావరణ హిత విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను సిద్ధం చేస్తున్నారు. పీఓపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా కృత్రిమ కొలనులను (బేబీ పాండ్స్) ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ ఈ ఏర్పాట్లను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ట్యాంక్‌బండ్ అనేది సంప్రదాయ నిమజ్జన ప్రాంతమని, అక్కడే కార్యక్రమానికి అనుమతించాలని డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోతే తామే సొంతంగా క్రేన్లు తెచ్చి నిమజ్జనాలు చేస్తామని ఆదివారమే హెచ్చరించింది. మొత్తంమీద ఒకవైపు కోర్టు ఆదేశాలు, పర్యావరణ పరిరక్షణ నిబంధనలు, మరోవైపు సంప్రదాయం పేరుతో ఉత్సవ సమితి పట్టుదల మధ్య హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం అంశం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఈ ప్రతిష్ఠంభన ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని నగరవాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని
# ప్రారంభిస్తున్న మాజీ మావోయిస్టులు

**నిత్యం నిఘా, హైదరాబాద్ :** తెలంగాణ దశాబ్దాల సామాజిక, రాజకీయ ఆకాంక్షలకు, ఉద్యమ భావజాలానికి ప్రాతిపదికగా రాష్ట్ర రాజకీయ యవనికపై త్వరలోనే నూతన పార్టీ ఆవిర్భవించేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. దాదాపు ఐదు దశాబ్దాలుగా విప్లవోద్యమాల్లో చురుగ్గా పనిచేసి, తదనంతరం సామాన్య జీవితంలోకి అడుగుపెట్టిన మాజీ మావోయిస్టులే ప్రధాన చోదకశక్తిగా 'జన తెలంగాణ పార్టీ' రూపుదిద్దుకుంటోంది. లంకా పాపిరెడ్డి (ల చ్చన్న), అడ్వొకేట్ బల్ల రవీంద్రనాథ్, గురి జాల రవీందర్‌రావులతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అభ్యుదయవాదులు, పౌరహక్కుల ఉద్యమకారులు ఇందులో కీలక పాత్ర పోషించనున్నారు. అయితే, ఆపరేషన్ కగార్ అనంతర పరిణామాల్లో బయటకు వచ్చిన దేవ్‌జీ –సంగ్రామ్ లేదా సోనూ – ఆశన్న వర్గాలు ఈ పార్టీ నిర్మాణంలో భాగస్వాములు కావడం లేదని తెలుస్తోంది. పార్లమెంటరీ ప్రజా స్వామ్య విధానంలోకి అడుగుపెడుతున్న ఈ కొత్త పార్టీ, త్వరలో జరగనున్న వరంగల్–ఖమ్మం–నల్లగొండ... హైదరాబాద్ – రంగా రెడ్డి – మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మె ల్సీ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. భారీ ప్రాజెక్టులు, జీడీపీ గణాంకాలే అభివృద్ధి కాదని, సామాన్యులకు ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉపాధి, ప్రశ్నించే స్వేచ్ఛే అసలైన అభివృద్ధి ప్రామాణికాలని తమ విధాన పత్రంలో పొందుపరచనున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలమైనా ప్రజా సమస్యలు తీర లేదన్న అభిప్రాయంతో ఉన్న ఈ బృందం, త్వరలోనే కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పార్టీ నమోదు కోసం అధికారికంగా దరఖాస్తు చేయనుంది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# వైద్యం నుంచి రాజకీయాల దిశగా..



## పరకాలతో కాళీ ప్రసాద్‌రావు అనుబంధం

- బీసీ చైతన్యానికి విద్యే బలం
- అందరినీ కలుపుకొని ముందుకు సాగాలి
- సామాజిక మార్పులో భాగస్వాములు కావాలి
- హక్కుల కోసం చైతన్యంతో ఉద్యమించాలి..
- చదువుకున్నవారు రాజకీయాల్లోకి రావాలి..

**హనుమకొండ, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ):**

**“బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యే ప్రధాన ఆయుధమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల నియోజక వర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్‌రావు అన్నారు. సామాజికంగా జ్ఞానోదయం రావడంతో పాటు హక్కుల కోసం చైతన్యంతో ఉద్యమించాలని సూచించారు. అయితే సామాజిక మార్పు కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన బాల్యం, విద్య, వైద్య ప్రస్థానం, ఎంబీబీఎస్‌లో ఎదురైన సామాజిక వివక్ష, వైద్య రంగంలో మార్పులు, గార్డియన్ ఆస్పత్రి నిర్మాణం, ఐఎంఏలో తన ప్రయాణం, బీసీ సామాజిక చైతన్యం, రాజకీయ ప్రవేశం, ఈటల రాజేందర్‌తో తన అనుబంధం, పరకాల నియోజకవర్గంతో ఉన్న బంధం తదితర అంశాలను ఆయన పంచుకున్నారు.**

### విద్యే వెనుకబడిన వర్గాల ఎదుగుదలకు ఆయుధం

బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యకు ప్రత్యామ్నాయం లేదని కాళీ ప్రసాద్‌రావు అన్నారు. కేవలం హక్కుల కోసం నినదించడం కాకుండా వాటిని సాధించేందుకు సామాజికంగా చైతన్యవంతులు కావాలని సూచించారు. ఇతర వర్గాలను దూరం చేయకుండా తమ సమస్యలను వివరించి వారిని కూడా భాగస్వాములను చేసుకుంటే సామాజిక మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

### ‘నన్ను డాక్టర్ చేయాలనేది నాన్న కోరిక’

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాక తన స్వగ్రామమని తెలిపారు. తల్లిదండ్రులు పగడాల వెంకటనర్సయ్య, వజ్రమ్మ అని చెప్పారు. తండ్రి ఉపాధ్యాయుడిగా పనిచేయడంతో ఉద్యోగరీత్యా పలు ప్రాంతాలకు కుటుంబం మారాల్సి వచ్చేదన్నారు. పదో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లోనే చదువుకున్నానని, పదో తరగతి చిట్యాలలో, ఇంటర్ పరకాలలో పూర్తి చేశానని తెలిపారు.



చిన్నతనం నుంచే తన తండ్రి తనను వైద్యుడిగా చూడాలని కోరుకునేవారని, అందుకే చదువుపై ఎంతో శ్రద్ధ పెట్టించేవారని గుర్తుచేసుకున్నారు. తోటిపిల్లలు ఆటలకు వెళ్లినా తాను మాత్రం పుస్తకాలతో కూర్చునే వాడినని చెప్పారు.

గ్రామంలోని ఉన్నత కుటుంబాల జీవనశైలి కూడా తనలో చదువుపై ఆసక్తిని పెంచిందన్నారు. బాగా చదువుకుంటే తాను కూడా ఉన్నత స్థాయికి ఎదగవచ్చనే ఆలోచన చిన్నతనంలోనే ఏర్పడిందని తెలిపారు.

### ఎంబీబీఎస్‌లోనే సామాజిక వివక్ష అనుభవం

ఇంటర్ వరకు కులం గురించి పెద్దగా ఆలోచించలేదని, మెడికల్ కాలేజీలో చేరిన తర్వాతే కుల వివక్షను ప్రత్యక్షంగా అనుభవించానని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. కొందరికి నమస్కారం పెట్టినా స్పందించక పోవడంతో కారణం అర్థం కాక తొలుత తన దుస్తుల విషయంలోనే అనుమానం కలిగిందన్నారు.

తర్వాత కాలేజీలో ఉన్న సామాజిక వర్గాల సమీకరణలు, పరస్పర సహకారం వంటి అంశాలను గమనించానని చెప్పారు. తాను ఎదుర్కొన్న అనుభవాలు బాధ కలిగించినప్పటికీ అదే తనలో పట్టుదలను పెంచిందన్నారు. ఆ కసిని చదువు, వైద్యం, వృత్తిపరమైన ఎదుగుదల వైపు మళ్లించానని వివరించారు.



### వైద్య రంగంలో కష్టపడి.. గార్డియన్ ఆస్పత్రి నిర్మాణం

ఎంబీబీఎస్, పీజీని కాకతీయ మెడికల్ కాలేజీలో పూర్తి చేసినట్లు తెలిపారు. అనంతరం ఏటూరునాగారంలో రెండేళ్లు, ఎంజీఎంలో సుమారు 12 సంవత్సరాలు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశానన్నారు.


వైద్య వృత్తిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ సేవలందించానని, ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేసిన రోజులు ఎన్నో ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. రోగుల ప్రాణాలను కాపాడినప్పుడు కలిగే సంతృప్తి ప్రత్యేకమని అన్నారు.

2008లో గార్డియన్ ఆస్పత్రికి శంకుస్థాపన చేసినప్పుడు కొందరు తనను నిరుత్సాహపరిచారని, అయితే తన ఆలోచనపై నమ్మకంతో ముందుకు సాగానని తెలిపారు. 2010లో ఉద్యోగానికి రాజీనామా చేసి ఆస్పత్రిని ప్రారంభించినట్లు చెప్పారు. రోగులకు 24 గంటలూ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఆస్పత్రి పై అంతస్తులోనే నివాసం ఏర్పాటు చేసుకున్నానన్నారు.

పేదలకు సాధ్యమైనంత వెసులుబాటు కల్పించడమే తన విధానమని తెలిపారు. ట్రామా సర్జరీ రంగంలో తనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు.

### ‘డాక్టర్–రోగి మధ్య దూరం పెరిగింది’

ప్రస్తుత వైద్య వ్యవస్థలో వైద్యులు, రోగుల మధ్య ప్రత్యక్ష సంబంధం తగ్గుతోందని కాళీ ప్రసాద్‌రావు అభిప్రాయపడ్డారు. గతంలో వైద్యులు రోగి నాడి పట్టి, సమస్యను అడిగి తెలుసుకుని వ్యాధిని అంచనా వేసేవారని, ప్రస్తుతం పరీక్షలు, మిషన్లపై ఆధారపడే పరిస్థితి పెరిగిందన్నారు. వైద్య ఖర్చులు పెరుగుతున్నాయని, భవిష్యత్‌లో వైద్య రంగంలో మానవీయ దృక్పథానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.



### ఐఎంఏలోనూ బీసీల ప్రాతినిధ్యానికి కృషి

1997లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)లో సభ్యత్వం తీసుకున్నానని తెలిపారు. 2023లో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసినట్లు చెప్పారు. వైద్య రంగంలో బీసీలకు నాయకత్వ అవకాశాలు పెరగాల్సిన అవసరం ఉందని, తాను అందుకు తన వంతు కృషి చేశానన్నారు. తన ఇద్దరు కుమార్తెలు కూడా వైద్య రంగంలో ఉన్నారని తెలిపారు. పెద్ద కుమార్తె తేజస్వీ ఆప్తల్మాలజీలో ఎంఎస్ పూర్తి చేయగా, చిన్న కుమార్తె యశస్వి ఎండీ జనరల్ పూర్తి చేసినట్లు చెప్పారు.

### ‘ఈటలే నా రాజకీయ గురువు’

చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉండేదని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి తనకు రాజకీయాలపై ఆసక్తి మరింత పెరిగిందన్నారు. 1983లో ఎన్టీఆర్‌ను చూడటానికి స్నేహితులతో కలిసి రేపాక నుంచి సైకిళ్లపై పరకాలకు వచ్చిన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

రాజబోయిన యాకయ్య ద్వారా ఈటల రాజేందర్‌తో పరిచయం ఏర్పడిందని తెలిపారు. ఈటల సహకారంతోనే మెడికల్ కాలేజీ ప్రారంభించానని, ఆయననే తన రాజకీయ గురువుగా భావిస్తానని చెప్పారు. తన రాజకీయ ప్రయాణం ఈటల రాజేందర్‌తోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు.

### ‘పరకాలతోనే నా బంధం’

ఈటల రాజేందర్ ప్రోత్సాహంతోనే పరకాల నియోజకవర్గంలో పనిచేస్తున్నానని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా నియోజకవర్గాన్ని విడిచిపెట్టలేదని, ఫలితాలు వచ్చిన మరుసటి రోజు నుంచే ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల్లో భాగస్వామిగా ఉన్నానన్నారు.

పరకాల ప్రజలతో తనకు దీర్ఘకాలిక అనుబంధం ఉందని, ప్రజల కోసం పనిచేయడమే తన లక్ష్యమని చెప్పారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా తనవంతు సహాయం అందించేందుకు ప్రయత్నిస్తున్నానన్నారు.

### ‘చదువుకున్నవారు రాజకీయాల్లోకి రావాలి’

రాజకీయాల్లో డబ్బు పెట్టి సంపాదించుకోవాలనే ధోరణి మారాల్సిన అవసరం ఉందని కాళీ ప్రసాద్‌రావు అన్నారు. చదువుకున్నవారు రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యలపై బాధ్యతతో పనిచేయాలని సూచించారు. తాను రాజకీయాలను కూడా ఒక కోర్సులా అధ్యయనం చేస్తున్నానని, ప్రజల సమస్యలను అర్థం చేసుకుంటూ ముందుకు సాగుతున్నానని చెప్పారు.డీలిమిటేషన్‌పై జరుగుతున్న ప్రచారంపై కూడా ఆయన స్పందిస్తూ అధికారిక నిర్ణయం వెలువడే వరకు వస్తున్న ఊహాగానాలను నమ్మాల్సిన అవసరం లేదన్నారు.

గ్రామీణ నేపథ్యం నుంచి వైద్యుడిగా ఎదిగి, వైద్య సంస్థను నిర్మించి, సామాజిక చైతన్యం, బీసీల విద్య, హక్కుల అంశాలను ముందుకు తెస్తూ రాజకీయాల్లోకొనసాగుతున్న తన ప్రయాణాన్ని కాళీ ప్రసాద్‌రావు చిట్‌చాట్‌లో వివరించారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# చెత్త కుప్పలతో హంటర్ రోడ్

- **అడ్వకేట్స్ కాలనీ ప్రధాన రహదారిపై దుర్గంధం.. స్థానికుల ఆగ్రహం**
- **శాశ్వతంగా చెత్త డబ్బాలు ఏర్పాటు చేసి పారిశుధ్య సమస్య పరిష్కరించాలని డిమాండ్**



**హనుమకొండ,సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** హనుమకొండ పరిధిలోని హంటర్ రోడ్ నుంచి అడ్వకేట్స్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి చెత్తాచెదారంతో నిండిపోయింది. నిత్యం వందలాది మంది వాహనదారులు, బాటసారులు రాకపోకలు సాగించే ఈ మార్గంలో చెత్త పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఈ ప్రాంతంలో చెత్త వేయకుండా నిర్దిష్ట ప్రదేశంలో చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ, అధికారులు వాటిని కొంతకాలం ఉంచి అనంతరం తొలగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజలు వ్యర్థాలను రహదారి పక్కనే పడేస్తుండటంతో ఆ ప్రాంతం చెత్త కుప్పగా మారిందని వాపోతున్నారు.ఈదురుగాలులు వీచినప్పుడు రహదారిపై పేరుకుపోయిన చెత్త పరిసర ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరుతోందని కాలనీవాసులు చెబుతున్నారు. దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా సమస్య కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారిపై పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన చెత్త డబ్బాలు ఏర్పాటు చేసి, క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని హంటర్ రోడ్, అడ్వకేట్స్ కాలనీ వాసులు కోరుతున్నారు.

# ప్రజావాణి వినతులను త్వరితగతిన పరిష్కరించాలి

- **అధికారులకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్‌బాజ్‌పాయ్ ఆదేశం**
- **ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని సూచన**



**హనుమకొండ, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే వినతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, త్వరిత గతిన పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలను స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్లు, ఆసరా పథకాలు, పారిశుధ్యం, ద్విచక్ర గృహాల కేటాయింపు, స్థానిక సమస్యలకు సంబంధించిన పలు వినతులను ప్రజలు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన అవసరమైన సమస్యలపై వెంటనే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఏ ఒక్క దరఖాస్తు కూడా అనవసరంగా పెండింగ్‌లో ఉంచకూడదని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు వేగవంతం చేయాలి

- **నిర్దేశిత గడువులోగా నిర్మాణం పూర్తి చేయాలి : ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్. చొంగ్తూ**
- **నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సమన్వయంతో పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశం**





**హనుమకొండ, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** తాడ్వాయి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని తెలంగాణ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్. చొంగ్తూ అధికారులను ఆదేశించారు. సోమవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించేందుకు ఆమె హనుమకొండకు వచ్చారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పూల మొక్క అందించి ఆమెకు స్వాగతం పలికారు.అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ ఆస్పత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించి జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# దామరవాయిలో ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం



**ములుగు జిల్లా /తాడ్వాయి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** తాడ్వాయి మండలంలోని దామరవాయి గ్రామపంచాయతీలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహిళల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి, తలస్నానాలు ఆచరించి నియమనిష్ఠలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అర్చకులు సదానంద చారి ఆధ్వర్యంలో భీమట స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి తీర్థప్రసాదాలు, నైవేద్యాలు సమర్పించి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకులు, భక్తులు ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజల విఘ్నాలు తొలగిపోవాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అన్నుల సరిత, దన్నూరి నర్మద, ధన్నూరు నాగలక్ష్మి , అప్పాజీ రమణ, నాగమణి, కవిత, అప్పాజీ భాగ్య, మోరే వనిత, మోరే అరుణ, అన్నుల కళ్యాణి, మోరే తరణి, రజితతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విశ్వనాథ కాలనీలో ఘనంగా గణపతి పూజలు

- **మట్టి గణపతికి గరికతో ప్రత్యేక పూజలునిర్వహించిన భక్తులు**
- **ఎనిమిదో రోజు వేడుకల్లో పాల్గొన్న కాలనీ పెద్దలు, మహిళలు, కమిటీ సభ్యులు**



**వరంగల్, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** వరంగల్ నగరంలోని 41వ డివిజన్ శంభునిపేట విశ్వనాథ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మట్టి గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎనిమిదో రోజు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతికి ప్రీతిపాత్రమైన గరికతో స్వామివారికి పూజలు చేయడం విశిష్టమని పేర్కొంటూ భక్తులు ప్రత్యేకంగా గరికను సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మట్టి గణపతి విగ్రహాన్ని కర్నే వరుణ్ విగ్రహదాతగా అందించగా, వంశీ యూత్ సభ్యులు సహకరించారు. కాలనీ అధ్యక్షుడు కర్నే రవీందర్ దంపతులతో పాటు కాలనీ పెద్దలు, మహిళలు, కమిటీ సభ్యులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ జాగర్లపూడి కోటయ్య శర్మ మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

- **ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలి**
- **అధికారులకు ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశం**






**ములుగు, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వకుండా సత్వర చర్యలు చేపట్టాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్, ఎం. సంపత్‌రావు, జిల్లా రెవెన్యూ అధికారి రవికుమార్‌తో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు.ఈ ప్రజావాణిలో మొత్తం 30 దరఖాస్తులు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 8, ఇందిరమ్మ ఇళ్లకు 5, పింఛన్లకు 4, ఉద్యోగాలకు 6, ఇతర శాఖలకు సంబంధించినవి 7 దరఖాస్తులు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను సంబంధిత శాఖలకు పంపిన అనంతరం వాటి పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏ దరఖాస్తు కూడా అనవసరంగా పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

- **ప్రజాదివాస్‌లో 16 ఫిర్యాదులు స్వీకరించిన భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**
- **పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా పోలీసులను ఆశ్రయించాలి**



**భూపాలపల్లి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 16 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్న ఆయన సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన పోలీస్ సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

# విద్యార్థులకు బూట్లు, బెల్టులు, బ్యాగుల పంపిణీ

- **వాజేడు మండలంలోని పలు పాఠశాలలకు విద్యా సామగ్రి అందజేత**



**ములుగు జిల్లా /వాజేడు, సెప్టెంబర్ 21(నిత్యం నిఘా ప్రతినిధి):** వాజేడు మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థుల అవసరాల కోసం బూట్లు, బెల్టులు, బ్యాగులను పంపిణీ చేశారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలకు బూట్లు, బెల్టులను, జీపీఎస్ పాఠశాలలకు బ్యాగులు, బెల్టులను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) తేజావత్ వెంకటేశ్వరరావు తన చేతుల మీదుగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సక్రమంగా అందించి, పాఠశాలల్లో వాటి వినియోగాన్ని పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# శీతాకాలంలో విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **ఆశ్రమ పాఠశాలల్లో సురక్షిత వాతావరణం కల్పించాలి: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో**



**ఏ టూరునాగారం, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** ఐటీడీఏ ములుగు జిల్లా పరిధిలోని అన్ని ఆశ్రమ పాఠశాలల హెడ్‌మాస్టర్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ టోప్పో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన తాజా ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలలు, వసతి గృహాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. దోమల నివారణకు మస్కిటో నెట్స్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ఇతర రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వారికి అవసరమైన వైద్య సేవలు అందేలా సమీపంలోని ఆరోగ్య కేంద్రాలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెడ్‌మాస్టర్లు, హెచ్‌డబ్ల్యూఓలు నిరంతరం పర్యవేక్షించాలని పీఓ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డీడీ జానార్ధన్, ఆర్‌సీఓ పద్మిని, హెచ్ఎం గంగు తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- **2026–27లో భూసేకరణకు రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం తక్షణమే చెల్లించాలి.. ప్రతి వారం పురోగతిపై సమీక్ష**



**ములుగు, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం–పునరావాస పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణకు ప్రత్యేక అధికారులను నియమించి ప్రతి వారం పురోగతిని సమీక్షించాలని సూచించారు. రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం–పునరావాస పునరుద్ధరణ పనుల పురోగతిపై సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, అటవీ శాఖ అధికారి వికాస్ మీనాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2026–27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, మరో రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విడుదలైన నిధులు అధికారుల వద్ద నిల్వ ఉండకుండా అర్హులైన భూయజమానులకు పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిధులు సరిపోకపోవడం లేదా ఇతర కారణాలతో పరిహారం చెల్లింపుల్లో జాప్యం ఉంటే ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పురోగతిని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేయాలని ఆదేశించారు.భూసేకరణ ప్రక్రియలో రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సూచించారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో ప్రక్రియ ను పూర్తి చేయాలని అన్నారు. నిబంధనల ప్రకారం రైతుల కు అన్యాయం జరగకుండా, పరిహారం మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా అవసరమైన భూసేకరణను ప్రాధాన్యతతో చేపట్టాలని మంత్రి సూచించారు. భూసేకరణకు సంబంధించి సమస్యలు ఎదురైతే హైదరాబాద్‌లోని భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అవార్డులు జారీ చేసిన తర్వాత కూడా పరిహారం చెల్లింపులు ఆలస్యం అయితే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భూసేకరణ, పునరావాసం–పునరావాస పునరుద్ధరణ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులను గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, ఇతర పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడపవద్దు

- **సురక్షితంగా ప్రయాణించండి.. ప్రాణాలను కాపాడుకోండి : ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ**
- **డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 150 మందికి అవగాహన, కౌన్సెలింగ్**



**వరంగల్, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు వరంగల్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని ట్రాఫిక్ శిక్షణ సంస్థలో ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన సుమారు 150 మంది వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, ప్రాణనష్టం, చట్టపరమైన పరిణామాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించిన అనంతరం వాహనం నడపకుండా, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.మద్యం సేవించి వాహనం నడపడం వల్ల వాహనం నడిపే వ్యక్తితో పాటు ఇతర వాహనదారులు, ప్రయాణికులు, పాదచారుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని పోలీసులు తెలిపారు. ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వాహనం నడిపి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఏసీపీ సత్యనారాయణ కోరారు. మైనర్లను వాహనాలు నడపడానికి అనుమతించవద్దని, మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. “మద్యం సేవించి వాహనం నడపవద్దు.. సురక్షితంగా ప్రయాణించండి.. ప్రాణాలను కాపాడుకోండి” అని ఏసీపీ వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ నవీన్ కుమార్, ఎస్ఐ వేణుగోపాల్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ అరుణతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనం నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో వైన్స్, బార్లు బంద్

- **సెప్టెంబర్ 22 ఉదయం 6 గంటల నుంచి 23 ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాల మూసివేత**



**నిజామాబాద్ కోటగిరి/పోతంగల్, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** వినాయక నిమజ్జన వేడుకలను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లను 24 గంటల పాటు మూసివేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.నిమజ్జన వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని మద్యం విక్రయ కేంద్రాలను మూసివేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ తెలిపారు.నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని కల్లు దుకాణాలు, కల్లు డిపోలు, వైన్ షాపులు (ఐఎంఎల్ షాపులు), 2-B బార్లు, క్లబ్బులను సెప్టెంబర్ 22 మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 23 బుధవారం ఉదయం 6 గంటల వరకు పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు.తెలంగాణ ఎక్సైజ్ యాక్ట్–1968లోని సెక్షన్ 20(1) ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీపీ తెలిపారు. నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.నిబంధనలను ఉల్లంఘించి మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ శాఖ హెచ్చరించింది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# తమ్ముడిని కత్తితో పొడిచి హత్య చేసిన అన్న అరెస్ట్

- **గీసుగొండలో 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు**
- **నిందితుడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలున్న దుస్తులు స్వాధీనం**

**గీసుగొండ, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని గరీబ్‌నగర్‌లో జరిగిన హత్య కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. తమ్ముడు ఎలుబాక ప్రసాద్ (31)ను కత్తితో పొడిచి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అతడి అన్న ఎలుబాక ప్రవీణ్ (33)ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 19న రాత్రి సుమారు 9.30 గంటలకు గరీబ్‌నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఎలుబాక ప్రసాద్ కత్తిపోట్లకు గురై మృతి చెందాడు. మృతుడి ఛాతి, వీపు, భుజం ప్రాంతాల్లో తీవ్ర గాయాలు గుర్తించారు. మృతుడి తల్లి ఎలుబాక సుజాత ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




### డబ్బుల విషయంలో విభేదాలు

దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. నిందితుడు ప్రవీణ్ తన తల్లిని తరచూ డబ్బులు అడిగేవాడని, ఈ విషయమై ప్రసాద్ అతడిని మందలించడంతో ఇద్దరి మధ్య గతంలో పలుమార్లు గొడవలు జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రసాద్‌పై ప్రవీణ్ కక్ష పెంచుకున్నాడని, తల్లి సంపాదించే డబ్బు తనకే దక్కాలనే ఉద్దేశంతో తమ్ముడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు పేర్కొన్నారు.

### వెల్డర్‌గా తయారు చేసుకున్న కత్తితో దాడి

సెప్టెంబర్ 19న రాత్రి ప్రవీణ్ తాను తయారు చేసుకున్న కత్తిని వెంట తీసుకుని గరీబ్‌నగర్‌లోని తల్లి, తమ్ముడు నివసించే ఇంటికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఆ సమయంలో తల్లి ఆస్పత్రిలో రాత్రి విధులకు వెళ్లగా ప్రసాద్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ప్రవీణ్ కావాలనే తమ్ముడితో వాగ్వాదానికి దిగి, అనంతరం కత్తితో అతడి వీపు, ఛాతి, భుజంపై పలుమార్లు పొడిచినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తీవ్ర రక్తస్రావంతో ప్రసాద్ అక్కడికక్కడే కుప్పకూలాడు. ఇరుగుపొరుగు వారు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించగా ప్రసాద్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దాడి సమయంలో జరిగిన పెనుగులాటలో ప్రవీణ్ ఎడమ బొటనవేలికి కూడా గాయమై రక్తస్రావమైనట్లు పోలీసులు తెలిపారు.

### తల్లిని కూడా బెదిరించినట్లు ఆరోపణ

దాడి అనంతరం ప్రవీణ్ కీర్తినగర్‌లోని తన ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని భార్యకు చెప్పిన అనంతరం తిరిగి తల్లి వద్దకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. తల్లి ప్రసాద్ మృతదేహం వద్ద ఏడుస్తుండటాన్ని గమనించి ఆమెను కూడా బెదిరించినట్లు పేర్కొన్నారు.

### ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స

ఎడమ బొటనవేలికి అయిన గాయానికి సెప్టెంబర్ 20న తెల్లవారుజామున సుమారు 12.30 గంటలకు గీసుగొండలోని ఆర్ఎంపీ వైద్యుడిని ప్రవీణ్ సంప్రదించినట్లు పోలీసులు తెలిపారు. గాయం ఎలా అయిందని వైద్యుడు ప్రశ్నించగా, తమ్ముడిని కత్తితో పొడిచే సమయంలో తన చేతికి గాయమైనట్లు చెప్పినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోవాలని వైద్యుడు సూచించినట్లు తెలిపారు.

### కత్తి, రక్తపు మరకలున్న దుస్తులు స్వాధీనం

సెప్టెంబర్ 21న నిందితుడు తన ఇంటి వైపు వస్తున్నట్లు సమాచారం అందడంతో గీసుగొండ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అతడి సమాచారం మేరకు ఇంటి సమీపంలోని పొదల్లో దాచిన హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు.ఈస్ట్ జోన్, వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్లూస్ బృందం సంఘటనా స్థలంలో శాస్త్రీయ ఆధారాలను సేకరించింది. స్వాధీనం చేసుకున్న వస్తువులకు ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించారు. నిందితుడు ఎలుబాక ప్రవీణ్‌ను రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. కేసును 24 గంటల్లో ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన గీసుగొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, ఎస్ఐలు అనిల్ కుమార్, కుమార్, కానిస్టేబుళ్లు అరవింద్, విజయ్, ప్రవీణ్, భాస్కర్, రజినీకుమార్‌లను ఏసీపీ ఎన్. వెంకటేష్ అభినందించారు.

# తెలంగాణ సాధన కోసం మంత్రి పదవినే
## తృణప్రాయంగా వదిలిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ

- **సంగెంలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు**
- **తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధికార ప్రతినిధి కందగట్ల నరహరి**

**వరంగల్ / సంగెం, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** సంగెం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో తెలంగాణ గాంధీ, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంగెం సర్పంచ్ పేర్ల లలిత రమేష్, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధికార ప్రతినిధి కందగట్ల నరహరి మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలి అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ తొలితరం ఉద్యమకారుడిగా, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తన మంత్రి పదవికి రాజీనామా చేసి, ఉద్యమానికి అంకితమైన బాపూజీ.. వృద్ధాప్యంలోనూ తెలంగాణ కోసం పోరాటం కొనసాగించారని గుర్తు చేశారు. 90 ఏళ్ల వయసులో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేపట్టి తెలంగాణ ఆకాంక్షను చాటారని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఆయన చేసిన త్యాగాలను నేటి తరం స్మరించుకోవాలని అన్నారు.



### చేనేత బిడ్డగా సామాజిక సేవ

పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత కార్మికుల సంక్షేమం, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం కృషి చేశారని నాయకులు తెలిపారు. అఖిల భారత పద్మశాలి సంఘం ఏర్పాటులోనూ ఆయన కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగెం ఉపసర్పంచ్ ఆగపాటి రాజు, పద్మశాలి సంఘం అధ్యక్షులు బిట్ల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గుండేటి బాబు, మాజీ ఎంపీటీసీ పులి వీరస్వామి, మునుకుంట్ల మోహన్, కోడూరి సదయ్య, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఇప్పకాయల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల మనోహర్, కమిటీ సభ్యులు బిట్ల రామకృష్ణ, కందకట్ల వెంకటేశ్వర్లు, కందకట్ల సంపత్, ఇప్పకాయల విజయ్ ప్రకాష్, అవధూత వెంకటేశ్వర్లు, పేరాల లక్ష్మీ నరసయ్య, బిట్ల లక్ష్మణ్, బిట్ల శ్రీను, బిట్ల వేణు, నల్ల రాజు, నల్ల శంకర్, చిందం వీరస్వామి, పులిపాటి మధు, ఇప్పకాయల రవి, రాజా నరేందర్, కటకం బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన దర్బార్ దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్

- **27 దరఖాస్తులు స్వీకరణ..**
- **సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలి**



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** ఐటీడీఏ ఏటూరునాగారం కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన దర్బార్‌లో స్వీకరించిన దరఖాస్తులను తక్షణ ప్రాధాన్యతతో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 27 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో విద్యాశాఖకు సంబంధించి 15, పోడు భూములకు సంబంధించి 3, జీవనోపాధికి సంబంధించి 4, బోర్‌వెల్, విద్యుత్ లైన్‌కు సంబంధించి 2, మావోయిస్టుల లొంగుబాటు అనంతరం జీవనోపాధికి సంబంధించి 1, ట్రైబల్ రిలీఫ్ ఫండ్‌కు సంబంధించి 2, గ్రామ పంచాయతీ భవనం పెండింగ్ పనులకు సంబంధించి 1 దరఖాస్తు ఉన్నాయి.ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పీఓ లెనిన్ వత్సల్ సూచించారు. కార్యక్రమంలో డీడీ జనార్దన్, ఏపీఓ దామోదర స్వామి, ఏఓ అనిల్ కుమార్, ఈఈ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల్లో తల్లి, ముగ్గురు పిల్లల ఆచూకీ

- **సిబ్బందిని అభినందించిన ఎస్సై శ్రీనివాస్**



**నిజామాబాద్ జిల్లా/కోటగిరి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** కుటుంబ కలహాల నేపథ్యంలో ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమైన తల్లి సాయిలతతో పాటు ఆమె ముగ్గురు పిల్లలు చైతన్య, చైత్ర, చైతులను కోటగిరి పోలీసులు 24 గంటల్లో గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. కోటగిరి మండలం యాద్గార్‌పూర్ గ్రామానికి చెందిన బి. సాయిలత శుక్రవారం భర్త ప్రశాంత్‌తో కుటుంబ కలహాల నేపథ్యంలో గొడవపడిన అనంతరం ముగ్గురు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే ఎత్తొండ క్యాంప్‌లోని పుట్టింటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సాయిలత తండ్రి లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కానిస్టేబుల్ ఆలీ, డబ్ల్యూపీసీ అనురాధ ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టి ఏడపల్లి ప్రాంతంలో సాయిలతతో పాటు ముగ్గురు పిల్లల ఆచూకీని 24 గంటల్లో గుర్తించారు. అనంతరం వారిని కోటగిరి ఎస్సై శ్రీనివాస్ ఎదుట హాజరుపరిచారు. ఎస్సై కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సాయిలత, ముగ్గురు పిల్లలను వారికి అప్పగించారు. తల్లి, పిల్లల ఆచూకీని సకాలంలో గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన కానిస్టేబుల్ ఆలీతో పాటు పోలీసు సిబ్బందిని ఎస్సై శ్రీనివాస్ అభినందించారు. పోలీసులు వేగంగా స్పందించి 24 గంటల్లో ఆచూకీ గుర్తించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఐలాపురంలో బతుకమ్మ మహిళా కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం



**ములుగు జిల్లా /తాడ్వాయి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి)** తాడ్వాయి మండల పరిధిలోని కాటాపురం గ్రామపంచాయతీ ఐలాపురం గ్రామంలో బతుకమ్మ మహిళా కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి గణనాథుడిని కొలిచారు.ఆలయ అర్చకులు గాదె సదానందచారి సమక్షంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళా కమిటీ సభ్యులు ఒక్కపొద్దు ఉపవాసం ఉండి భక్తిభావంతో పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజల కష్టాలు తొలగిపోవాలని మహిళలు గణనాథుడిని ప్రార్థించారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన, భక్తిభావం పెంపొందాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# తొలి వేతనం గణపతి సేవకు.. శ్యామ్ కుమార్ కుటుంబం ఆదర్శం

- గంగాపురి యూత్ గణపతి వద్ద అన్నదానం నిర్వహించిన అట్టే శ్యామ్ కుమార్ కుటుంబ సభ్యులు





**పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి ):** కష్టపడి సాధించిన ప్రభుత్వ ఉద్యోగం ద్వారా వచ్చిన తొలి వేతనాన్ని గణపతి సేవకు అంకితం చేసి అట్టే శ్యామ్ కుమార్ కుటుంబ సభ్యులు భక్తి, సేవాభావాన్ని చాటుకున్నారు. పెద్దపల్లి జిల్లా కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అట్టే శ్యామ్ కుమార్‌కు సుమారు ఆరు నెలల క్రితం ప్రభుత్వ ఉద్యోగం లభించింది. తొలి వేతనంతో గంగాపురి యూత్ గణపతి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గణపతి మండపం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించి, భక్తిశ్రద్ధలతో గణపతిని పూజించారు. ఈ సందర్భంగా శ్యామ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగం సాధించడం తన జీవితంలో ఎంతో సంతోషకరమైన విషయమని, తాను పేద కుటుంబం నుంచి ఈ స్థాయికి చేరుకోవడంలో దైవానుగ్రహం కూడా కారణమని తెలిపారు.“తొలి వేతనంతో గణపతి సేవ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ అవకాశం కల్పించిన గణపతి దేవుడికి కృతజ్ఞతలు. ఇది ఒక్క కార్యక్రమంతో ఆగిపోదు. భవిష్యత్తులో కూడా నా శక్తి మేరకు దైవ, సేవా కార్యక్రమాలకు సహకరిస్తాను” అని శ్యామ్ కుమార్ తెలిపారు. అనంతరం గంగాపురి యూత్ గణపతి యువకులు మాట్లాడుతూ.. ఉద్యోగం వచ్చిన ఆనందాన్ని వ్యక్తిగత వేడుకలకే పరిమితం చేయకుండా తొలి వేతనాన్ని గణపతి సేవకు వినియోగించడం అభినందనీయమన్నారు. శ్యామ్ కుమార్ కుటుంబ సభ్యులపై గణపతి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. తొలి వేతనం నుంచే సేవా మార్గాన్ని ఎంచుకున్న శ్యామ్ కుమార్ కుటుంబం తీసుకున్న ఈ చిన్న అడుగు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తుందని గంగాపురి యూత్ యువకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కందగట్ల నరహరి

- బూర నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు



**వరంగల్ / సంగెం, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** సంగెం మండలం నార్లవాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బూర ప్రకాష్ తండ్రి బూర నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధికార ప్రతినిధి కందగట్ల నరహరి సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా బూర నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నల్ల రాజు, బూర శ్రీనివాసు, దేవులపల్లి శంకరయ్య, మడత సుధాకర్, దేవులపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తోటి పాత్రికేయుడిని పరామర్శించిన మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్

- పితృవియోగంతో బాధలో ఉన్న రామడుగు సాయి శ్రీనివాస్‌కు సభ్యుల పరామర్శ

**పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి ):** పితృవియోగంతో బాధలో ఉన్న తోటి పాత్రికేయుడు, భారత్ వార్త రిపోర్టర్ రామడుగు సాయి శ్రీనివాస్‌ను మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ సభ్యులు పరామర్శించారు. మంథని పట్టణానికి చెందిన సాయి శ్రీనివాస్ తండ్రి రామడుగు ప్రభాకర్ ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు సాయి శ్రీనివాస్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రధాన కార్యదర్శి మహావాది సతీష్ కుమార్ మాట్లాడుతూ.. క్లబ్ సభ్యులంతా ఒకే కుటుంబంగా భావించి, తోటి పాత్రికేయుడికి కష్టకాలంలో అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సమయంలో ధైర్యంగా ఉండాలని సాయి శ్రీనివాస్‌కు సూచించారు.స్వర్గీయ రామడుగు ప్రభాకర్ చదరంగ క్రీడ ప్రోత్సాహకుడిగా, ఉపాధ్యాయుడిగా, ఆధ్యాత్మిక సాధకుడిగా మంథని ప్రాంత ప్రజలకు సుపరిచితులని సతీష్ కుమార్ గుర్తు చేశారు. ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొడారి మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహావాది సతీష్ కుమార్, మండల కన్వీనర్ ఎగోలపు సంతోష్ గౌడ్, కోశాధికారి కాచర్ల శంకర్, ఎండీ. సుభాన్, మంథని లక్ష్మణ్, మాదేశి శ్రావణ్ కుమార్, కావేటి సమ్మయ్య, కాశీపేట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# చెరువులను అక్రమంగా దున్నినా చర్యలు తప్పవు

- చెరువు శిఖం పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు

**హనుమకొండ /ఎల్కతుర్తి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** చెరువులను అక్రమంగా దున్నుకోవడం, చెరువు శిఖం పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, కాలువలను ఆక్రమించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఇరిగేషన్ అధికారులు హెచ్చరించారు. సోమవారం ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామంలో ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది కాలువలు, చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నీటి వనరుల పరిరక్షణకు గతంలోనూ ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. చెరువుల నిర్మాణం కోసం పట్టా భూములను సైతం నీటి వనరులుగా మార్చిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం చెరువులు, కాలువల పరిధిలో ఆక్రమణలు చేయడం, చెరువులను పూడ్చివేయడం, వ్యవసాయ భూములుగా మార్చేందుకు ప్రయత్నించడం, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలిగించే విధంగా చెరువులు, కాలువల పరిధిలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలకు పాల్పడినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడకుండా చెరువులు, కాలువల పరిధిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇరిగేషన్ ఏఈ సమంత్ ఆధ్వర్యంలో మైనర్ ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, కాలువలను పరిశీలించారు. కాలువల ప్రస్తుత పరిస్థితి, నీటి ప్రవాహానికి ఉన్న ఆటంకాలు, ఆక్రమణలు తదితర అంశాలను పరిశీలించి వివరాలు సేకరించారు. నిబంధనలు ఉల్లంఘించి చెరువులు, కాలువలను ఆక్రమించినా, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి, ఉపసర్పంచ్ మరుపాక సందీప్, రైతులు, ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మల్లంపల్లిలో మండల స్థాయి ప్రజావాణి

- 10 వినతులు, ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు

**ములుగు జిల్లా / మల్లంపల్లి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** ములుగు జిల్లా మల్లంపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన 17 మంది అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి మొత్తం 10 వినతిపత్రాలు, ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎండీ రహీముద్దీన్ సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.




# కుటుంబానికి అండగా నిలిచిన వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్

- కొమ్మరాజుల మల్లయ్య కుటుంబానికి 50 కిలోల బియ్యం విరాళం

**హనుమకొండ / ఎల్కతుర్తి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కోతులనడుమ గ్రామానికి చెందిన స్వర్గీయ కొమ్మరాజుల మల్లయ్య కుటుంబానికి వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ బత్తుల వెంకటేష్ అండగా నిలిచారు.రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు స్వర్గీయ కొమ్మరాజుల మల్లయ్య కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని బత్తుల వెంకటేష్ విరాళంగా అందజేశారు. ఎల్కతుర్తి మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు వల్లపు యాదగిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన బత్తుల వెంకటేష్, వారి కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు గండికోట కుమార్, జంపాయ కొమురయ్యతో పాటు పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# దామరవాయిలో ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం



**ములుగు జిల్లా /తాడ్వాయి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** తాడ్వాయి మండలంలోని దామరవాయి గ్రామపంచాయతీలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహిళల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి, తలస్నానాలు ఆచరించి నియమనిష్ఠలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అర్చకులు సదానంద చారి ఆధ్వర్యంలో భీమట స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి తీర్థప్రసాదాలు, నైవేద్యాలు సమర్పించి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకులు, భక్తులు ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజల విఘ్నాలు తొలగిపోవాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అన్నల సరిత, దన్నూరి నర్మద, ధన్నూరు నాగలక్ష్మి , అప్పాజీ రమణ, నాగమణి, కవిత, అప్పాజీ భాగ్య, మోరే వనిత, మోరే అరుణ, అన్నల కళ్యాణి, మోరే తరణి, రజితతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మా నివాసాలు మాకే కావాలి.. ఉర్సు వాసుల నిరసన

- **భూ సమస్యను పరిష్కరించాలి.. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ ఎదుట మెరుపు ధర్నా**



**వరంగల్, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** వరంగల్ నగరంలోని 40వ డివిజన్ పరిధి ఉర్సు ప్రాంత కాలనీవాసుల నివాస స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ ఎదుట ఉర్సు వాసులు మెరుపు ధర్నా నిర్వహించారు. సర్వే నంబర్లు 273, 274, 275, 276లోని భూముల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉర్సు ప్రాంతానికి చెందిన బత్తిని అఖిల్, పూజారి విజయ్, ప్రియాంక మాట్లాడుతూ తమ పూర్వీకుల కాలం నుంచి నివాసం ఉంటున్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరారు. తమ వద్ద ఏళ్ల క్రితం నుంచి ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇంటి పన్ను, విద్యుత్ బిల్లులు వంటి ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఇటీవల కొందరు వ్యక్తులు తమ నివాస స్థలాలపై హక్కులు ఉన్నట్లు పేర్కొంటూ వివాదానికి వస్తున్నారని, తమ భూములను వక్ఫ్ బోర్డు భూములుగా ప్రచారం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ భూములకు సంబంధించి గతంలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయించి సమస్యను పరిష్కరించుకున్నామని, భూములు విక్రయించిన వారికి చెక్కుల ద్వారా డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. తాము దశాబ్దాలుగా, కొన్ని కుటుంబాలు సుమారు వందేళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని పేర్కొన్నారు. 1954 నుంచి తమకు సంబంధించిన వివరాలు రికార్డుల్లో ఉన్నాయని తెలిపారు. ఇన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటున్న తమపై ప్రస్తుతం భూ వివాదాలు సృష్టించడం ఆవేదన కలిగిస్తోందన్నారు. తమ నివాసాలపై హక్కులను పరిరక్షించాలని, సమస్య పూర్తిగా పరిష్కరించే వరకు సర్వే ప్రక్రియ విషయంలో తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

# కాటాపురం హైస్కూల్లో విద్యార్థులకు షూస్ పంపిణీ

- **ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు**




**ములుగు జిల్లా /తాడ్వాయి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** తాడ్వాయి మండలంలోని కాటాపురం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అందించిన షూస్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కాటాపురం గ్రామ సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు షూస్ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న వివిధ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, హైస్కూల్ హెచ్ఎం బాణాల సుధాకర్, సక్రూనాయక్, హిందీ ఉపాధ్యాయుడు సమ్మయ్య, పీఈటీ మేడమ్, ఇతర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వేదమంత్రాలతో గణపతి నిమజ్జనం

- **సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా వినాయక నిమజ్జన ఊరేగింపు**





**పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి ):** మంథని పట్టణంలోని శ్రీ మహాగణపతి దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి నిమజ్జన కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రాలు, భక్తిగీతాల నడుమ సాగిన వినాయక నిమజ్జన ఊరేగింపు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా సాగింది.వేద పాఠశాల ఉపాధ్యాయులు బ్రహ్మశ్రీ ఒజ్జల గణేష్ శర్మ ఆధ్వర్యంలో వేద విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. వేదమంత్రాల నడుమ సాగిన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు ఉన్న మంథని పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. నిమజ్జన ఊరేగింపులో మహిళా భక్తులు సైతం సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో మహావాది విజయ్ కుమార్, మహావాది శివ, ఆలయ అర్చకులు పల్లి రాము, శ్రీనందన్, దేవిశ్రీ ప్రసాద్, సుమేధ, శ్రీవత్సవ, అశ్విన్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# కొడిశెల ఆశ్రమ పాఠశాలలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

- **విద్యార్థులతో కలిసి శ్రమదానం చేసిన సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్**





**ములుగు జిల్లా /తాడ్వాయి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి)** తాడ్వాయి మండలం లింగాల గ్రామపంచాయతీ పరిధిలోని కొడిశెల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 'స్వచ్ఛతా హి సేవా–స్వచ్ఛతమే సహభాగ్–స్వచ్ఛ భారత్–వికసిత్ భారత్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మోడెం రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, పరిశుభ్రమైన వాతావరణంతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో శ్రమదానం నిర్వహించగా, సర్పంచ్ రవీందర్ స్వయంగా విద్యార్థులతో కలిసి పాల్గొని ఆదర్శంగా నిలిచారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను తమ బాధ్యతగా భావించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్, పంచాయతీ కార్యదర్శి మోడెం రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. దేవదాస్, వార్డెన్ కేబుల్ కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట పీఏసీఎస్‌లో కొత్త డైరెక్టర్లు

- **కొండేటి మహేందర్, బిసుపాక పూలమ్మకు కీలక బాధ్యతలు**
- **రైతు సంక్షేమమే లక్ష్యంగా పీఏసీఎస్ సేవలను విస్తరిస్తాం**





**వరంగల్ / వర్ధన్నపేట,సెప్టెంబర్ 21 ( నిత్యం నిఘా ప్రతినిధి):** వర్ధన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో కొండేటి మహేందర్, బిసుపాక పూలమ్మ డైరెక్టర్లుగా నియమితులయ్యారు. వర్ధన్నపేట పట్టణానికి చెందిన కొండేటి మహేందర్, వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బిసుపాక పూలమ్మ కొత్తగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఏసీఎస్ సేవలను రైతులకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సహకార సంఘం ద్వారా అందే సేవలను విస్తరించడంతో పాటు, ప్రభుత్వ పథకాలు, రైతులకు సంబంధించిన సహకార సేవలు సమర్థవంతంగా అందేలా పనిచేస్తామని పేర్కొన్నారు.పీఏసీఎస్‌ను కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా రైతులకు అండగా నిలిచే వేదికగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. రైతుల సమస్యలను తెలుసుకుని, వారి ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.తమను డైరెక్టర్లుగా నియమించేందుకు సహకరించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త డైరెక్టర్ల నియామకంతో వర్ధన్నపేట పీఏసీఎస్ ద్వారా రైతులకు అందే సేవలు మరింత మెరుగుపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మామునూరు విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలి



**వరంగల్ /పర్వతగిరి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** వరంగల్ జిల్లా మామునూరులో నిర్మించనున్న విమానాశ్రయానికి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్పీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు, వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని పేర్కొన్నారు. చారిత్రకంగా వరంగల్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, కాకతీయుల కాలంలో రాజధానిగా గుర్తింపు పొందిన నగరంగా వరంగల్ చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగి ఉందన్నారు.ప్రపంచవ్యాప్తంగా విద్యావేత్తగా, న్యాయవేత్తగా, భారత రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్న మామునూరు విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలనే ప్రతిపాదనకు మేధావులు, విద్యావేత్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, అంబేద్కర్‌ను ఆదర్శంగా భావించే వారు, అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో జేరుపోతుల శ్రీనివాస్, పసుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# 40వ డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలి

**కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు : మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి**

**వరంగల్, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని 40వ డివిజన్‌లో మంజూరైన అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. ఈ మేరకు సోమవారం వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ వెంకన్నకు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

### ఉప్పరోని కుంట బాక్స్ డ్రెయిన్ పనులు పూర్తి చేయాలి

ఉప్పరోని కుంట వద్ద బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి కాంట్రాక్టర్ ముందుకు వచ్చినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కింగ్ ఇవ్వకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయని రవి తెలిపారు. దీంతో మురుగునీరు ఉర్సు హిందూ స్మశాన వాటికలోకి చేరుతోందని, దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదన్నారు.

### సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి

బైపాస్ రోడ్డు నుంచి కుమ్మరివాడకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం కోసం ఆరు నెలల క్రితం అప్పటి మంత్రి కొండా సురేఖ, అప్పటి మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేశారని తెలిపారు. అయితే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వివరించారు.

### వరద ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలి

ఉర్సు చెరువు సమీపంలో కొందరు బిల్డర్లు వర్షపు, వరద నీరు ప్రవహించే మార్గాల్లో విల్లాల నిర్మాణాలు చేపడుతున్నారని రవి ఆరోపించారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో వరద నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయా అనే అంశంపై అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### నూతన కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి



డివిజన్‌లో నూతనంగా ఏర్పడిన కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళ ప్రజలు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయా కాలనీల్లో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలను అమర్చాలని కోరారు. అలాగే డివిజన్‌లో అవసరమైన ప్రాంతాల్లో నూతన డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలని కమిషనర్‌ను కోరారు. మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి వివరించిన సమస్యలపై కమిషనర్ వెంకన్న స్పందిస్తూ.. సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రవి తెలిపారు.

# మద్యపాన నిషేధంపై అక్టోబర్ 2న కలెక్టరేట్ ముట్టడి

- **చలో అమరావతికి భారీగా తరలిరావాలి: ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ**



**హనుమకొండ / ఎల్కతుర్తి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్–ఎంఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, సీనియర్ నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ మద్యపాన నిషేధాన్ని కోరుతూ అక్టోబర్ 2న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మద్యపానం కారణంగా అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం మద్యపాన నిషేధంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఎల్కతుర్తి మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.అదేవిధంగా అక్టోబర్ 7న నిర్వహించనున్న చలో అమరావతి కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్–ఎంఎస్పీ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. అమరావతిలో నిర్వహించనున్న జాతీయ సదస్సును విజయవంతం చేసేందుకు మండలం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. మండల అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ మాట్లాడుతూ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చేపడుతున్న ఉద్యమ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు రావాలని కోరారు. అక్టోబర్ 2న కలెక్టరేట్ ముట్టడి, అక్టోబర్ 7న చలో అమరావతి కార్యక్రమాలకు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు బాధ్యతతో పనిచేస్తూ గ్రామస్థాయిలో కార్యకర్తలను సమీకరించాలని అన్నారు. సీనియర్ నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ మాట్లాడుతూ సంఘం చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని అన్నారు. ఈ సమావేశంలో జర్నలిస్టు ఫోరం నాయకులు బొంకూరి వంశీ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి చిలుముల వినోద్ మాదిగ, మండల నాయకులు అడ్డూరి నవీన్ మాదిగ, అల్లకొండ బాలు మాదిగతో పాటు ఎమ్మార్పీఎస్–ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిత్యం నిఘా కథనంతో కదిలిన అధికారులు.. మట్టి కుప్ప తొలగింపు

**పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి ):** మంథని పట్టణంలోని లైన్‌గడ్డ సమీపంలో ప్రధాన రహదారి మూలమలుపు వద్ద ప్రమాదకరంగా పేరుకుపోయిన మట్టి కుప్పను అధికారులు తొలగించారు. దీంతో రహదారిపై రాకపోకలకు ఏర్పడిన ఆటంకం తొలగిపోవడంతో వాహనదారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లైన్‌గడ్డ ప్రధాన రహదారి మూలమలుపులో పెద్ద మట్టి కుప్ప పేరుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి భద్రత దృష్ట్యా మట్టి కుప్పను తక్షణమే తొలగించాలని కోరారు. ఈ సమస్యపై 'ప్రమాదం జరిగాకే మేల్కొంటారా?' అనే శీర్షికతో 'నిత్యం నిఘా' తెలుగు దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు తక్షణమే స్పందించారు. వార్త ప్రచురితమైన కొద్దిసేపటికే సిబ్బందిని అక్కడికి పంపించి, యంత్రాల సహాయంతో మట్టి కుప్పను పూర్తిగా తొలగించారు. మట్టి కుప్ప తొలగిపోవడంతో మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన 'నిత్యం నిఘా' తెలుగు దినపత్రిక యాజమాన్యానికి, వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన అధికారులకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.





నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ప్రమాదం జరిగాకే మేల్కొంటారా?

- మూలమలుపులో మట్టి కుప్ప..
  వాహనదారులకు పాంచి ఉన్న ప్రమాదం
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం..
  ప్రమాదం జరిగేలోపే తొలగించాలని డిమాండ్

పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని పట్టణంలోని లైన్‌గడ్డ సమీప ప్రధాన రహదారిపై మూలమలుపులో మట్టి కుప్ప ప్రమాదానికి ఆహ్వానం పలుకుతోంది. రహదారిపై ప్రమాదకరంగా మట్టి పేరుకుపోయి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూలమలుపు కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పాటు రహదారిపై ఉన్న

# కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

- **పద్మశాలి వార్డును 'పద్మశాలి మార్క్'గా అభివృద్ధి చేస్తాం: చైర్మన్**

**కరీంనగర్ జిల్లా/జమ్మికుంట, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):** తెలంగాణ సాధన కోసం పదవులను సైతం త్యజించి, మలిదశ తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శిగా నిలిచిన ప్రముఖ నాయకుడు, సామాజికవేత్త కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని ఘన నివాళులు అర్పించారు. అనంతరం పద్మశాలి స్ట్రీట్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం పదవులను సైతం త్యజించి, తన జీవితాన్ని బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అంకితం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలు, ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణంలోని పద్మశాలి సమాజంతో తనకు ఎంతో అనుబంధం ఉందని తెలిపారు. గతంలో 12వ వార్డు నుంచి పద్మశాలి కుల బాంధవులు తనను రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలిపించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు తాను పద్మశాలి కుటుంబ సభ్యుడిగానే ఉన్నానని పేర్కొన్నారు.పద్మశాలి వార్డుకు వెళ్లే ప్రధాన మార్గంలో కమాన్ నిర్మించడంతో పాటు, మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని 'పద్మశాలి మార్క్'గా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు చుంచు రమాదేవి, చింతల శ్రీనివాస్, దిడ్డి రాము, చుంచు శివ, ఉడుత రమేష్, మనోహర్, అరెకాల వీరేశలింగంతో పాటు పద్మశాలి సంఘం నాయకులు, పద్మశాలి కుటుంబ సభ్యులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



# తెలంగాణ కోసం పదవినే త్యజించిన బాపూజీ

- **ఆయన ఆశయాలే నేటి తరానికి స్ఫూర్తి**
- **మంథనిలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి**



**పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి ):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని మంథనిలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు మంథని మండల అధ్యక్షుడు ఏగోలపు శంకర్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పుప్పాల భాగ్యలక్ష్మి తిరుపతి ఆధ్వర్యంలో బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఆయన నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలోనూ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమ బాట పట్టిన ఆయన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వయస్సును సైతం లెక్కచేయకుండా చివరి వరకు పోరాడిన బాపూజీ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పదవులు, రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజల ఆకాంక్షలు, తెలంగాణ ఆత్మగౌరవానికి ఆయన ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. బాపూజీ ఆశయాలను స్మరించుకుంటూ నేటి తరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కొండా లక్ష్మణ్ బాపూజీ 2012 సెప్టెంబర్ 21న హైదరాబాద్‌లో కన్నుమూశారని నాయకులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులర్పించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# రామప్పకు ముప్పు కలిగించే ఓపెన్‌కాస్ట్ గని ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

- **సమగ్ర శాస్త్రీయ, పర్యావరణ, భూగర్భ జలాలు, వారసత్వ ప్రభావ అధ్యయనాలు చేపట్టాలి : కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్**



**హనుమకొండ, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి ):**
వెంకటాపూర్ ప్రాంతంలో ప్రతిపాదించిన పి.వి. నరసింహారావు ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని వల్ల రామప్ప ప్రపంచ వారసత్వ ప్రదేశం, రామప్ప చెరువు, పరిసర పర్యావరణం, వ్యవసాయం, భూగర్భ జలాలపై కలిగే ప్రభావాలను సమగ్రంగా అధ్యయనం చేయాలని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ డిమాండ్ చేసింది. హనుమకొండ ప్రగతినగర్‌లోని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం ఈ అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ట్రస్టీ, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ డాక్టర్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**రామప్ప పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి**
ఈ సందర్భంగా తక్కళ్లపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ వెంకటాపూర్‌లో ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ గని అంశాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అత్యంత సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. రామప్ప దేవాలయం ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన నేపథ్యంలో దేవాలయంతో పాటు దాని సహజ, జల, భౌగోళిక, సాంస్కృతిక పరిసరాలను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు.
రామప్ప చెరువు, నీటిపారుదల వ్యవస్థలు, కొండలు, అడవులు, వ్యవసాయ భూములతో కూడిన విస్తృత పరిసరాలను దృష్టిలో ఉంచుకుని గని ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

**లోతైన తవ్వకాలపై శాస్త్రీయ అధ్యయనం అవసరం**
సమావేశంలో పాల్గొన్న నిపుణులు ప్రతిపాదిత గనిలో సుమారు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరిగే అవకాశాల నేపథ్యంలో భూగర్భ జలాల ప్రవాహం, నీటి మట్టాలు, భూగర్భ పగుళ్లు, లైన్‌మెంట్లపై సంభవించే ప్రభావాలను ముందుగానే అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.
రామప్ప చెరువు నీటి మట్టం, పరిసర భూగర్భ జలాల మధ్య ఉన్న సంబంధాన్ని కూడా హైడ్రోజియాలజీ, జియోటెక్నికల్, జియోఫిజికల్ అధ్యయనాల ద్వారా పరిశీలించాలని సూచించారు. చెరువు కట్ట నిర్మాణం, పునాది, సీపేజ్ మార్గాలు, కట్-ఆఫ్ ట్రెంచ్ తదితర అంశాలను నిపుణుల బృందంతో పరిశీలించాలని కోరారు.
లోతైన గని పిట్ ఏర్పడటం వల్ల భూగర్భ జలాల ప్రవాహ దిశల్లో మార్పులు సంభవించే అవకాశాలను హైడ్రాలిక్ మోడలింగ్ ద్వారా అధ్యయనం చేయాలని, కట్టలో సీపేజ్, 'పైపింగ్ ఫినామినాన్' వంటి అంశాలపై కూడా శాస్త్రీయ పరిశీలన అవసరమని సమావేశంలో అభిప్రాయపడ్డారు.

**బ్లాస్టింగ్ ప్రభావంపై అధ్యయనం చేయాలి**
ఓపెన్‌కాస్ట్ గనిలో డ్రిల్లింగ్, బ్లాస్టింగ్, భారీ యంత్రాల వినియోగం వల్ల ఉత్పన్నమయ్యే భూకంప తరంగాలు, గ్రౌండ్ వైబ్రేషన్ల ప్రభావాన్ని రామప్ప దేవాలయ నిర్మాణ భద్రతపై అంచనా వేయాలని సమావేశం కోరింది. రామప్ప దేవాలయ నిర్మాణ ప్రత్యేకతలను దృష్టిలో ఉంచుకుని మైనింగ్ కార్యకలాపాలకు ముందు, అనంతరం వైబ్రేషన్, నిర్మాణ స్థిరత్వం తదితర అంశాలను శాస్త్రీయ పరికరాలతో నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

**ప్రజల్లో శాస్త్రీయ అవగాహనకు నిర్ణయం**
ప్రతిపాదిత గని వల్ల కలిగే భౌగోళిక, జల, పర్యావరణ, వ్యవసాయ, వారసత్వ ప్రభావాలపై వెంకటాపూర్, పరిసర గ్రామాల ప్రజలకు శాస్త్రీయ అవగాహన కల్పించాలని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ నిర్ణయించింది. రైతులు, గ్రామీణ ప్రజలు, యువతతో పాటు వివిధ వర్గాలకు భూగర్భ జలాలు, రామప్ప చెరువు, వ్యవసాయం, పర్యావరణం, వారసత్వ పరిరక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.
అలాగే ఇంజనీర్లు, భూగర్భ శాస్త్రవేత్తలు, హైడ్రోజియాలజిస్టులు, న్యాయవాదులు, వైద్యులు, రైతులు, యువత, పర్యావరణ నిపుణులు, అటవీ రంగ ప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ప్రజా సంఘాల ప్రతినిధులతో మరిన్ని రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.

**ప్రధాన డిమాండ్లు**
వెంకటాపూర్ పి.వి. నరసింహారావు ఓపెన్‌కాస్ట్ గని ప్రతిపాదనను పునఃపరిశీలించాలని, రామప్ప దేవాలయం, చెరువు, పరిసర ప్రాంతాలపై స్వతంత్ర హెరిటేజ్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నిర్వహించాలని సమావేశం డిమాండ్ చేసింది.
అదేవిధంగా సమగ్ర హైడ్రోజియోలాజికల్, గ్రౌండ్‌వాటర్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్, జియోటెక్నికల్, జియోఫిజికల్ అధ్యయనాలు చేపట్టాలని కోరింది. 300 మీటర్ల లోతైన తవ్వకాల వల్ల సంభవించే హైడ్రాలిక్ మార్పులు, చెరువు కట్ట భద్రత, సీపేజ్, పైపింగ్ ప్రమాదాలు, బ్లాస్టింగ్ వైబ్రేషన్లపై నిపుణులతో అధ్యయనాలు నిర్వహించాలని పేర్కొంది.
స్థానిక గ్రామాల ప్రజలు, రైతులు, వారసత్వ నిపుణుల అభిప్రాయాలను నిర్ణయ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోవాలని, రామప్ప ప్రపంచ వారసత్వ సంపదకు ఎలాంటి ప్రమాదం లేదని శాస్త్రీయంగా నిర్ధారించే వరకు గనికి సంబంధించిన తదుపరి చర్యలను నిలిపివేయాలని సమావేశం కోరింది. ఈ సమావేశంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అధ్యక్షుడు ఖాజీపేట పురుషోత్తం, మీడియా ఇన్‌చార్జి మండల పరశురాములు, ఎం.డి. రెహమాన్, జన విజ్ఞాన వేదిక ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, ధర్మప్రకాష్, ప్రొఫెసర్ శ్రీనివాసాచార్యులు, సోహం రెడ్డి, శుభం రెడ్డి, కె. ఓంకార్, వాటర్‌మ్యాన్ వి. ప్రకాష్, రామ్‌మోహన్‌రావు, జె. శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు. రామప్ప పరిరక్షణ కోసం ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ అవసరమైన ప్రజాస్వామ్య, చట్టబద్ధ కార్యక్రమాలను కొనసాగిస్తామని సమావేశంలో పాల్గొన్న వారు తెలిపారు.

# వర్ధన్నపేట PACS పగ్గాలు అబ్బిడి రాజిరెడ్డికి

- **కొత్త చైర్మన్‌గా నియామకం.. రైతు సంక్షేమమే లక్ష్యమంటున్న రాజిరెడ్డి**

**వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):**
వర్ధన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) నూతన చైర్మన్‌గా దమ్మన్నపేట గ్రామానికి చెందిన అబ్బిడి రాజిరెడ్డి నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర సహకార శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. రైతుల సంక్షేమం, సహకార రంగం బలోపేతానికి రాజిరెడ్డి చేస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకుని ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. దీంతో వర్ధన్నపేట PACSలో కొత్త నాయకత్వం ఏర్పడింది.

**రైతుల శ్రేయస్సే నా ధ్యేయం**
తన నియామకంపై అబ్బిడి రాజిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి, సహకార శాఖ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు PACSను బలోపేతం చేసి అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు. రాజిరెడ్డి నియామకంతో దమ్మన్నపేటతో పాటు వర్ధన్నపేట మండలంలోని పలువురు రైతులు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. రైతులకు అందుబాటులో ఉంటూ PACS



ద్వారా అందించే సేవలను మరింత విస్తరించేందుకు కొత్త చైర్మన్ దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

## గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

### అంగన్వాడీ సూపర్‌వైజర్ స్వరూపరాణి



**వరంగల్ /పర్వతగిరి, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):**
పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ పాల్గొనగా, ఆశా వర్కర్ మోటాపోతుల విమల, అన్నారం యూపీ ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ సోమేశ్వర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ సూపరవైజర స్వరూపరాణి ముఖ్య అతిథిగా హాజరై గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి ఆకుకూరలు, పప్పు దినుసులు, ఉడికించిన గుడ్లు, చేపలు, పండ్లు, మొలకెత్తిన విత్తనాలు, పండ్ల రసాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.గర్భిణీలు, బాలింతలు నాణ్యమైన సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండటమే కాకుండా పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు అందుతాయని వివరించారు. ముఖ్యంగా ఐరన్, ప్రోటీన్లు, విటమిన్లు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు.అన్నారం షరీఫ్ గ్రామంలో మొత్తం మూడు అంగన్వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయని, వాటిలో అంగన్వాడీ కార్యకర్తలు చెడిపాక సునీత, టి. ధనలక్ష్మి , జి. ఇందిరా సేవలందిస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు అధిక సంఖ్యలో పాల్గొని పోషణ మాసం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# యూనిఫామ్‌లతో విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం

- **గుంజపడుగు ఎం.పి.పి.ఎస్. విద్యార్థులకు ఉచిత దుస్తుల పంపిణీ**

**పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి ):**
మంథని మండలం గుంజపడుగు గ్రామంలోని ఎం.పి.పి.ఎస్. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత యూనిఫామ్‌లను సోమవారం గ్రామ సర్పంచ్ దండవేన సంధ్య బానేష్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సంధ్య బానేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్‌లు అందించడం అభినందనీయమన్నారు. యూనిఫామ్‌లను గ్రామంలోని స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా కుట్టించడం వల్ల వారికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు.గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు గుంజపడుగు గ్రామ మహిళల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో



పాటు మహిళలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు కొనసాగడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమాదేవి, చంద్రశేఖర్, సి.ఎ.లు కుంట భూలక్షి , నీరటి రాధ, కొప్పుల రమాదేవితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.